## క్లుప్తంగా

### వ్యవసాయానికి 'ఉపాధి'ని అనుసంధానించాలి



మాట్లాడుతున్న నరేష్‌కుమార్ రెడ్డి

కదిరి: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కదిరి పట్టణంలోని రెడ్డి సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 6న విజయవాడలో రెడ్ల ఐక్య చైతన్య సభ నిర్వహిస్తామని, ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనేది ప్రధాన డిమాండ్‌గా చేర్చామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బయపరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రేనాటి నాగేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అమడగూరు: ఓడీచెరువులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు నిధులు రూ.5 లక్షలతో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటుచేసి బుధవారం ప్రారంభించారు. పాఠశాల చైర్మన్, ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం 12 ట్యాప్‌లు కలిగిన పెద్ద వాటర్ ప్లాంట్‌ను చేసినట్లు తెలిపారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో చైర్మన్ జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అమడగూరు: ఓడీ చెరువు మండంలోని తంగేడుకుంట గ్రామ సచివాలయంలో సిబ్బంది గైర్హాజరు కావడంపై ఎంపీడీఓ రెడ్డెప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన తంగేడుకుంట, అల్లాపల్లి గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. తంగేడుకుంటలో సచివాలయ సిబ్బంది ఎలాంటి అనుమతి లేకుండా, మూవ్‌మెంట్ రిజిస్టార్‌లో రాయకుండా హాజరుకాకపోవడంపై మండిపడ్డారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

### ఘనంగా తొలి దర్శనం

బత్తలపల్లి: బత్తలపల్లి ఖాశీంస్వామి ఉత్సవాలను బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభించారు. భక్తులకు ప్రథమ దర్శనం కల్పించారు. ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్ బాషా, నజరుల్లా, కాశీంవలి ఫాతెహా నిర్వహించారు. కాశీంస్వామిని భక్తులకు ప్రథమ దర్శనం కల్పించారు. 20వ తేదీన అలంకరణ, 23 వరకు నిత్యపూజ నివేదన పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఐ ఆరోహనరావు, ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష బందోబస్తు చర్యలు చేపట్టారు.


### యశోదలో కేబినెట్ ఏర్పాటు

ధర్మవరం: పట్టణంలోని యశోద కాన్సెప్ట్ పాఠశాలలో బుధవారం పాఠశాల డైరెక్టర్ పృథ్వీ రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కేబినెట్ ఏర్పాటు చేశారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి నూతన ఎస్‌పీఎల్, ఏఎస్‌పీఎల్‌లను నియమించారు. టూటౌన్ సీఐ రాజా వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అనూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యోధుడిలా సేవలు.. అందరితో ప్రశంసలు

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పోతలయ్య. కనగానపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కరోనా విజృంభించిన సమయంలో తన ప్రాణాలు లెక్కచేయకుండా సేవలందించాడు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకుని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. కరోనా జాగ్రత్తలను ప్రజలకు వివరించాడు. దాతలు అందించిన శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశాడు. కరోనా సోకి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుల వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు అందజేసి, మానవత్వం చాటుకున్నాడు. సేవలకు మెచ్చి అప్పటి జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు 'యోధులకు వందనం' కింద ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

– కనగానపల్లి:






కరోనా సమయంలో కూరగాయలు అందజేస్తున్న వలంటీర్ పోతలయ్య (ఫైల్)

### ప్రాణాలకు తెగించి సేవ చేశాడు..



కరోనా సమయంలో ఇంటి నుంచి బయలకు వెళ్లాలంటే భయంగా ఉండేది. అటువంటి సమయంలో మా గ్రామ వలంటీర్ పోతలయ్య మా ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ అందజేయడం సంతోషకరం. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన కూరగాయలు, పండ్లు, శానిటైజర్లను ఇంటింటికీ తిరిగి అందజేశాడు. వలంటీర్ ప్రాణాలకు తెగించి మాకు సేవలు చేయటం చాలా గొప్ప విషయం.

– పెదన్న, బీసీ కాలనీ, కనగానపల్లి

# ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

తలుపుల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వెళ్తోందని తహసీల్దార్ శ్రీధర్ అన్నారు. మండలంలోని ఓబుల రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం సర్పంచ్ సుమియా, మండల అగ్రీ బోర్డు చైర్మన్ చెన్నక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామక్రిష్ణారెడ్డి, ఎంపీడీఓ కిరణ్ మోహన్ లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

**కుమ్మరవాండ్లపల్లిలో..**

కదిరి అర్బన్: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి–1 సచివాలయంలో బుధవారం ఎంపీడీఓ అంజనప్ప ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. అనంతరం వివిధ రకాల 950 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ శాంతమ్మ, వైస్ ఎంపీపీలు బత్తల రామలక్ష్మమ్మ, ఎంపీటీసీ పుల్లయ్య తదితరులున్నారు.

**11 రకాల ఉచిత సేవలు**

ధర్మవరం రూరల్: జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం 11 రకాల ఉచిత సేవలను లబ్ధిదారులకు అందిస్తోందని డీఎల్‌డీఓ శివారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గొట్లూరు, తుమ్మల, సుబ్బరావుపేట గ్రామాలలో సర్పంచులు పిట్టా నరసమ్మ, పుల్లమ్మ, ఈశ్వరమ్మల అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంపును నిర్వహించారు. ఎంపీపీ గిరక రమాదేవి, మండల ప్రత్యేకాధికారి చాంద్‌బాషా, ఎంపీడీఓ సౌజన్య కుమారి, ఎంపీటీసీ చెన్న క్రిష్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్లూరు మారుతి, సంగాలప్ప తదితరులు పాల్గొన్నారు.

**తనకల్లు మండలంలో...**

తనకల్లు: చీకటిమానిపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష పథకంలో భాగంగా బుధవారం అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, ఎంపీడీఓ పూల నరసింహులు మాట్లాడారు. సర్పంచ్ రామాంజులమ్మ, తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, ఎంఈఓ–2 కళ్యాణి, ఈఓఆర్డీ ఆనందయ్య, నాయకులు బడా నాగభూషణరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

రామగిరి: సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేసే బాధ్యత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లదేనని ఎంపీపీ క్రైన్న, ఎంపీడీఓ అలివేలమ్మ పేర్కొన్నారు. బుధవారం రామగిరి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో వారు సమావేశమయ్యారు. సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణ స్వామి, ఏఓ మురళీకృష్ణ, హౌసింగ్ ఏఈ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు**

ప్రశాంతి నిలయం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని మున్సిపల్ చైర్మన్ ఓబులపతి అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 6, 7 సచివాలయాల పరిధిలో కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నవీన్ కుమార్, సచివాలయాల కన్వీనర్ సూర్యాగౌడ్ లబ్ధిదారులకు 11 రకాల సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తిప్పన్న,మున్సిపల్ కౌన్సిలర్‌లు ఈశ్వరమ్మ, సాయి గీత, భాస్కర్‌రెడ్డి, సరస్వతి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, నాయకులు మాధవరెడ్డి, నారాయణ రెడ్డి, బ్రిక్స్‌సాయి, కవి, మారెప్ప, భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, బీరే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన మహారాష్ట్ర వాసులు

బత్తలపల్లి: ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న ఘటనలో మహారాష్ట్ర వాసులు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన మేరకు... మహారాష్ట్రలోని సతార జిల్లా, కథావక్ ప్రాంతానికి చెందిన రోహిత్, శేఖర్, ఆనంద్ కారులో తిరుపతికి ప్రయాణిస్తూ బుధవారం ఉదయం బత్తలపల్లి మండలం కోడేకండ్ల వద్దకు చేరుకోగానే కదిరి నుంచి అనంతపురం వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీ కొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# పండ్ల తోటల సాగుతో మంచి ఆదాయం

తాడిమర్రి: పండ్లతోటల సాగుతో మంచి ఆదాయం గడించొచ్చునని ఎంపీడీఓ విజయలక్ష్మీ రైతులకు సూచించారు. మండలంలోని నార్శింపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా వెంగమనాయుడు, నారాయణమూర్తి తదితర రైతులు సాగు చేసిన మామిడి తోటలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పండ్లతోటల సాగులో తీసుకోవలసిన చర్యలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, సాంకేతిక, క్షేత్ర సహాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీ ఆశోక్ కుమార్‌రెడ్డి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ అరుణ, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

**ఉద్యాన పంటలు పండించండి**

కదిరి అర్బన్: ఉద్యాన పంటలను పండించాలని ఎంపీడీఓ అంజనప్ప పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చిప్పలమడుగులో రైతు ఈశ్వర్‌రెడ్డి పొలంలో హార్టికల్చర్ ఫిట్టింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కదిరి మండలంలో మొత్తం 136 ఎకరాల్లో పండ్ల తోటలు పెంపకానికి మంజూరైనట్లు తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీధర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# మా కష్టాలు తీర్చిన జగనన్న





ధర్మవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, కదిరిలో..

• సీఎంకు ఆర్టీసీ ఉద్యోగుల కృతజ్ఞతలు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల కష్టాలు తీర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రజా రవాణా అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. పుట్టపర్తి డిపో ఆవరణలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎఫ్ హయర్ ఆప్షన్ ద్వారా అత్యధిక పెన్షన్ విధానం రానుందన్నారు. దీంతో ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ విరమణ పొందిన తరువాత వస్తున్న పెన్షన్ 5 రెట్లు పెరుగుతుందన్నారు. 2022 సంవత్సరానికి సంబంధించి పీఆర్‌సీ, అరియర్స్‌ను ఆర్టీసీ సిబ్బందికి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి సర్కారుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ఎస్టీఐ పెద్దన్న, కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రుణపడి ఉంటాం**

ధర్మవరం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఆర్టీసీ ఉద్యోగులు జీవితాంతం రుణపడి ఉండాలని అసోసియేషన్ల నాయకులు తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆర్టీసీ ఉద్యోగులను అన్ని రకాలుగా ఆదుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేషులు, ఆఫీస్ హెడ్ క్లర్క్ ప్రేమ్‌కుమార్, అకౌంటెంట్ ఓబులేసు, ఎంసీ వెంకటేశ్వర్లు, వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నాయకులు నాగేంద్ర, ఈశ్వర్‌ప్రసాద్, డిపో నాయకులు సీనయ్య, ముత్యాలప్ప, ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, ఎన్‌ఎంయుఏ నాయకులు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

**మా పాలిట దైవం ముఖ్యమంత్రి**

కదిరి అర్బన్: తమ పాలిట దైవం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కదిరి డిపో ఆర్టీసీ ఉద్యోగులు పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు హయర్ ఆప్షన్‌తో అధిక పెన్షన్ సదుపాయానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినందుకు బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డీఎం మైనొద్దీన్, ఎన్‌ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఈహెచ్‌ఎస్, ఏపీజీఎల్ఐసీ సదుపాయం కల్పించారని చెప్పారు. ఆర్టీసీలో 5 స్పెషల్ గ్రేడ్స్ ఇచ్చి ఆర్థిక బలం పెంచారని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హరిత, రామక్రిష్ణ, అసోసియేషన్ నాయకులు ఎస్వీ రమణ, ఉత్తన్న, నాగరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# 21 నుంచి ప్రత్యేక ఓటరు నమోదు



ఓటరు నమోదు పుస్తకాలను పంపిణీ చేస్తున్న అధికారులు

బత్తలపల్లి: ఈ నెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటికీ ఓటరు నమోదు పరిశీలన కార్యక్రమాన్ని బీఎల్‌ఓలు విజయవంతం చేయాలని మడకశిర ఎన్నికల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిన్నపెద్దయ్య, తహసీల్దార్ యుగేశ్వరిదేవి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటినీ సందర్శించి ఓటరు జాబితాలో డోర్ నంబర్ లేని ఓటర్లకు ఖచ్చితమైన డోర్ నెంబర్ గుర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కేంద్రంలో ఎవరు ఉంటారు, వారి విధులు ఏమిటి అనే విషయాలపై ముందుగా తెలుసుకోవాలన్నారు. కేటాయించిన ప్రాంతాల్లో ఓట్లను నమోదు చేయడంతో పాటుగా ఎవరైనా ఆన్‌లైన్‌లో చేసుకుంటామని వస్తే వారికి సహకారం అందించాలన్నారు. అనంతరం ఓటరు నమోదు రిజిస్టర్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా సంక్షేమ కాంతులు



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ఎన్పీకుంట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి గడపలోనూ సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ధనియాని చెరువు సచివాలయం పరిధిలోని వంకమద్ది, గురికానివారిపల్లి, పెదరాంపల్లి, పోరెడ్డివారిపల్లి, సోమరాజుకుంట, కుంట్లపల్లివారిపల్లి, కోటిరెడ్డిపల్లి గ్రామాలలో ప్రభుత్వ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. వంకమద్ది గ్రామంలో పక్షవాతంతో మంచానికి పరిమితమైన రమణ, ఓబులేశును పరామర్శించారు. డీఎంహెచ్ఓ పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గురికానివారిపల్లికి చెందిన నారాయనమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెదరాంపల్లిలో వ్యవసాయ మోటార్లు అమర్చుకోవడానికి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఏఈని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. కుంట్లపల్లివారిపల్లి, పోరెడ్డివారిపల్లి గ్రామాలకు సీసీ రోడ్లు వేయడానికి ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు ఆదేశించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు గంగాధర్ రెడ్డి, ఆంజినేయులునాయక్ వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటెరాము, వైస్ ఎంపీపీ కేశవ రెడ్డి, స్థానిక సర్పంచులు ఈటెరాధ, కె.దిల్షాద్, ఎంపీటీసీలు కొత్తరంగారెడ్డి, తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్రకుమార్, సర్పంచులు నాగముణీశ్వరనాయుడు, రామాంజులురెడ్డి, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, యూత్‌కన్వీనర్ వేణుగోపాల్‌యాదవ్, బీసీసెల్ కన్వీనర్ ఆదెప్పనాయుడు, వాటర్‌షెడ్ చైర్మన్లు క్రిష్ణారెడ్డి, బయారెడ్డి, ఓబుళరెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మినారాయణరెడ్డి, గ్రామ కన్వీనర్‌లు వెంకటేశ్వర్లు, రామక్రిష్ణ, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ రాఘవయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గంగమ్మ తల్లికి బోనాలు

తనకల్లు: మండల పరిధిలోని కనసానివారిపల్లి సమీపంలో వెలసిన ధనకొండ గంగమ్మ తల్లికి బుధవారం వివిధ గ్రామాల ప్రజలు ఘనంగా బోనాలు పట్టారు. ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో మండల దీక్ష హోమం, అభిషేకం, జ్యోతులు, కుంకుమార్చనతో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తాదులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ పునర్నిర్మాణ దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### వాల్మీకి సంఘం కార్యవర్గం ఎన్నిక

కదిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి సంఘం నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడిగా బొట్టు చంద్ర, ఉపాధ్యక్షుడిగా వాసు, ప్రధాన కార్యదర్శిగా బి.చిన్న అంజి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు వాల్మీకులు పాల్గొన్నారు.

### రూ. 10 లక్షలతో తాగునీటి సౌకర్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కట్లతండాలో రూ. 10 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి సౌకర్యాన్ని బుధవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రారంభించారు. తమ గ్రామానికి తాగునీటి సమస్య ఉందని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చారు. స్పందించిన ఆయన పంచాయతీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేయించారు. దీంతో బోరు, మోటారు, పైప్‌లైన్ ఏర్పాట్లు చేశారు. తాగునీటి సమస్య లేకుండా చేసిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### పరామర్శ



కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి సర్పంచ్ శాంతాబాయ్‌ను బుధవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డి పరామర్శించారు. ఇటీవల తిరుపతిలో ఆమె మోకాలికి ఆపరేషన్ చేశారు. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆనంద్ నాయక్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్,నాయకులు లింగాల మధుసూదన్ రెడ్డి తదితరులున్నారు.

### వైద్యాధికారులకు సన్మానం

తాడిమర్రి: స్థానిక పీహెచ్‌సీలో బదిలీపై వెళ్లిన డాక్టర్ మహేంద్రనాథ్, జ్యోతిర్మయి, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఇద్దరు ఎంఎల్‌హెచ్‌పీలను బుధవారం సన్మానించారు. డాక్టర్ కృష్ణప్రసాద్, కంటి వైద్యాధికారి ఉరుకుందప్ప, ఎంపీహెచ్‌ఓలు మనోహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**బదిలీ ఉపాధ్యాయులకు..**

నల్లమాడ: రెడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ నుంచి బదిలీ అయిన హెచ్‌ఎం శ్రీనివాసులు, పీడీ లక్ష్మీపతినాయక్, టీచర్లు రామలింగారెడ్డి, బాలాజీనాయక్‌ను సన్మానించారు.



## సంక్షిప్త సమాచారం

**సెల్ టవర్ ఎక్కి నిరసన**

పుట్టపర్తి టౌన్: తన ఇంటి స్థలాన్ని కబ్జా చేశారంటూ బుధవారం కొత్తచెరువు మండలం మైలేపల్లిలో ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. కుటుంబ సభ్యులు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కథ సుఖాంతమైంది.

**ప్లాస్టిక్ కవర్ల తయారీ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలి**

తనకల్లు: నిబంధనలకు వ్యతిరేకంగా ప్లాస్టిక్ కవర్లను తయారు చేస్తున్న ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు చౌడప్పయాదవ్ తదితరులున్నారు.

**వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి**

ధర్మవరం రూరల్: ఖాళీ పడిన గ్రామ వలంటీర్ల పోస్టులకు ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సౌజన్య కుమారి తెలిపారు. రావులచెరువు (ఓసీ)–1, రేగాటిపల్లి (ఓసీ)–1, (బీసీ) 1, (ఎస్సీ) 1 ఖాళీ ఉన్నట్లు పేర్కొన్నారు.

**రైతు కుటుంబాన్ని ఆదుకోండి**

కనగానపల్లి: అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకొన్న మహిళా రైతు శ్రావణి కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న కోరారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

**మోదీ పథకాలే గెలిపిస్తాయి**

నల్లమాడ: మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తాయని ఆపార్టీ జిల్లా నాయకులు మేకల శ్రీనివాసులు, తలమర్ల హరికృష్ణ గౌడ్ పేర్కొన్నారు. బీజేపీ పుట్టపర్తి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం బుధవారం నల్లమాడలో నిర్వహించారు. నియోజకవర్గం అభ్యర్థిగా రత్నాకరం కొండమరాజును నిలపాలని తీర్మానించారు. నాయకులు కత్తి రాజారెడ్డి, శేషాద్రినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మురళీ, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బస్సు పాసులకు నగదు వితరణ**

చెన్నేకొత్తపల్లి: మేడాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పేద విద్యార్థుల బస్సు పాసులకు రూ.12 వేలను వైఎస్సార్‌సీపీ నాయకులు బోగన్న గారి సూర్యనారాయణ వితరణ చేశారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ మేరకు పాసులు అందజేశారు.

**మందుల షాపు యజమానులకు నోటీసులు**

గాండ్లపెంట: మండల కేంద్రంలోని మందులషాపులతో పాటు రెక్కమానులోని రెండు మందుల షాపుల యజమానులకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి బుధవారం నోటీసులు జారీ చేశారు. యాసిడ్ కావాలని వచ్చిన వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

**సాకే భారతికి సన్మానం**

ధర్మవరం అర్బన్: కూలి పని చేసుకుంటూ పీహెచ్‌డీ సాధించిన సాకే భారతిని ఆంధ్రప్రదేశ్ విలేజ్, వార్డు సెక్రటేరియట్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ మహబూబ్‌బాషా అభినందించారు. శింగనమల మండలం నగులగూడం గ్రామంలో ఉన్న సాకే భారతిని బుధవారం కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.

**ఒలింపియాడ్‌లో సత్తా**

ధర్మవరం: నాగలూరు రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థులు ఒలింపియాడ్‌లో సత్తా చాటారు. మహమ్మద్ రుజైన్, తేజస్విని రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి స్కాలర్‌షిప్ అందుకున్నారు. 20 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ బుధవారం తెలిపారు.